## శివారు కాలనీల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మే 23 : శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రీ నగర్ బ్యాంకు కాలనీలో రూ.71లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జీహెచ్ఎంసీ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో ఉన్న సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయన్నారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో నిధులను మంజూరు చేయిస్తూ, ఆ నిధులు వృథా కాకుండా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ధ్యానాంజనేయస్వామి పాలకమండలి నియామకం

చంపాపేట, మే 23: నగరంలో ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో ఒక్కటైన శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం పాలక మండలిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రమేయర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మకర్తలుగా దిండు ప్రవీణ్ గౌడ్, మొరిశెట్టి శ్రీనివాస్, తోకటి కిరణ్, సింగంశెట్టి శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ దుర్గా రెడ్డి, కుకునూరి గోపాల్ రెడ్డి, పూల నాగరాజ్, కవిత, ఒరుగంటి నరేశ్, కొండ్ర సంతోష్ కుమార్, బండి గారి శ్రీనివాస్ గౌడ్, అనుముల రవీందర్ రెడ్డి, ఈడులకంటి సత్యనారాయణరెడ్డి లను ధర్మకర్తలుగా, ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఆలయ ప్రధాన అర్చకులు అంబా ప్రసాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదు మాసాలుగా దేవాలయ పాలకమండలి ఎప్పుడనే ప్రశ్నలకు ఎట్టకేలకు ముగింపు పడింది. దురదృష్టవశాత్తు వీరిలో మొరిశెట్టి శ్రీనివాస్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్థానంలో మరొక్కరి ధర్మకర్త ను నియమించాల్సిన పరిస్థితి రావడం అందరిని కలచివేస్తుంది.

## రైల్లో చైన్‌స్నాచింగ్

కాచిగూడ, మే 23: ఎలహంక రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్ భార్య వాణి ఎలంక రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ఐటిక్యాల రైల్వేస్టేషన్ సమీపంలో గల క్రాసింగ్ వద్ద గురువారం అర్ధరాత్రి రైలు స్లో కావడంతో ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు రైలు కిటికీలోంచి వాణి మెడలో ఉన్న 50 గ్రాముల చైన్‌ను స్నాచింగ్ చేశారు. బాధితురాలు కాచిగూడ రైల్వే పీఎస్ లో ఫిర్యాదు చేసింది.

# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, మే 23: మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న వారిని పలకరించి వారి గురించి తెలుసుకొని ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకుంటున్నారు. మహేశ్వరం గేటు వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న సిబ్బంది పైకి ద్విచక్ర వాహనం దూసుకురావడంతో ఒక వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. పలు వివాహ వేడుకల్లో పాల్గొని మహేశ్వరం నుంచి హైదరాబాద్ వైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గమనించి గాయాల పాలైన వృద్ధుడిని దవాఖానకు పంపించి మానవత్వం చాటుకున్నారు. ఆమె వెంట మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రామ్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, నందినేని నరేందర్ రెడ్డి ,మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎస్టీసెల్ మాజీ అధ్యక్షుడు లచ్యా నాయక్, వెంకట రాజిరెడ్డి, మహేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

హయత్ నగర్, మే 23 : నియోజకవర్గంలోని హయత్ నగర్ డివిజన్ పరిధిలో ఆంధ్ర కేసరి నగర్, కమలానగర్ చుట్టు పక్కల కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్, ఆంధ్రకేసరి నగర్ చుట్టుపక్కల కాలనీవాసులు తమ కాలనీల సమస్యల మీద ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40ఏళ్లుగా ఆయా కాలనీల్లో వేల సంఖ్యలో ఇండ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల ఓ ప్రైవేటు వ్యక్తి ఆర్‌డీఓ కార్యాలయంలో స్థలాలు తనవేనని కేసు వేశారని పేర్కొన్నారు. దీనికి ఆర్డీవో స్టేటస్ కో ఇవ్వడం జరిగిందని, ఈ విషయం కాలనీ వాసులకు తెలిసిందన్నారు. ఆయా కాలనీవాసులు తన వద్దకు రావడంతో ఎమ్మెల్యే ఆర్డీవోకు ఫోన్ చేశారు. ప్రజలు దాదాపుగా 40 సంవత్సరాల క్రితం ఇల్లు కట్టుకొని ఉంటున్నారని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణ పనుల్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దానిలో భాగంగా బ్యాంకులు లోన్ కూడా ఇచ్చారని తెలిపారు. వారు న్యాయంగా ఇండ్లు కట్టుకొని ఉన్నారని, ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని అన్నారు. ఎవరో కబ్జా పెట్టాలని దురుద్దేశంతో వచ్చి మిమ్మల్ని తప్పుదోవ పట్టించారని అన్నారు. కాలనీవాసులు ఎవరు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దని హామీ ఇచ్చారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## ఉద్యోగులకు అండగా ఉంటాం



జెండా ఆవిష్కరిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆర్కేపురం, మే 23: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ -82 నూతన జెండాను రాష్ట్ర నాయకులు షౌకత్ పాషా, సాయి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. శుక్రవారం సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో గల చంపాపేట్, సరూర్ నగర్, ఇబ్రహీంపట్నం డివిజన్‌లకు చెందిన మూడు సర్కిల పరిధిలో నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు వచ్చి, స్థానిక ఎంప్లాయిస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. సరూనగర్ సర్కిల్ పరిధిలోని చంపాపేట్ సరూర్‌నగర్ ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నూతన జెండా ఆవిష్కరణ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్మికులు ఐక్యతతోనే తమ హక్కులను సాధించుకుంటారని అన్నారు. తమ యూనియన్ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, శ్రీకాంత్ రెడ్డి, కంపెనీ నాయకులు బాల్ రెడ్డి, కావలి వెంకటేశ్, పెద్దయ్య, సర్కిల్ నాయకులు శివారెడ్డి, రాజు, ఫయాజ్, డివిజన్ నాయకులు శ్రావణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, ఉదయ్, కిరణ్, హరీశ్ రెడ్డి, మహేందర్ రావు, రాజు, ప్రవీణ్, సర్కిల్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లో ఎక్కడి చెత్త అక్కడే..

సైదాబాద్, మే 23: మాదన్న పేట కూరగాయల మార్కెట్ దుర్గంధంగా మారింది. ఒకవైపు రోజు కురుస్తున్న వర్షాలు, మరోవైపు సక్రమంగా కూరగాయల వ్యర్థాలను తొలగించకపోవడంతోచెత్తా చెదారంతో డంపింగ్ యార్డు గా మారింది. ఎక్కడ చూసిన చెత్త కుప్పలు, పారిశుద్ధ నిర్వహణలో పంగా, అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మార్కెట్లో వ్యర్థాలను క్రమం తప్పకుండా తొలగించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మా ర్కెట్ వ్యర్థ కుప్పలకు నిలయంగా మారింది. ప్రజలకు, వినియోగదారులకు అసౌకర్యంగా మారిన మాదన్న పేట మార్కెట్లో కనీస వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

**మార్కెట్‌ను సందర్శించిన వైస్ చైర్మన్**

మదన్నపేట మార్కెట్‌ను శుక్రవారం హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారుల వైఖరి మూలంగా మార్కెట్లో పారిశుధ్య పనులు అధ్వానంగా తయారయ్యాయని అన్నారు. వర్షపు నీరు మార్కెట్లో పలు ప్రాంతాల్లో నిలిచిపోవడంతో పాటు, కూరగాయల వ్యర్థాలను తొలగించుకోకపోవడంతో దుర్గంధ వాసన వెదజల్లుతుందని అన్నారు. తక్షణమే పరిసరాలు శుభ్రం చేసి వ్యర్థాలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరేశ్, మార్కెట్ శాఖ అధికారి సంధ్య, మల్లికార్జున్,హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్







# రూ.10 లక్షల బిల్లులు స్వాహా

- కుమ్మక్కైన అధికారులు, కాంట్రాక్టర్
- అవాక్కైన కార్పొరేటర్ శ్వేత
- కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు

సైదాబాద్, మే 23: ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ కలిసి చేసిన అవినీతి బయటపడింది. పనులు చేయకున్నా చేసినట్లు దొంగ రికార్డులను సృష్టించి సంస్థని బురిడీ కొట్టించారు. సుమారు పది లక్షల రూపాయలను గండి కొట్టిన ఘటన జీహెచ్ఎంసీ సంతోష్ నగర్ సర్కిల్ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో జరిగింది. తనకు తెలియకుండానే డివిజన్‌లో అభివృద్ధి పనులు చేసినట్లు దొంగ లెక్కలు చూపించిన అధికారుల బాగోతం వెలుగులోకి రావడంతో కార్పొరేటర్ జంగం శ్వేత అవాక్కయ్యారు. తన డివిజన్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసి ఫిర్యాదు చేశారు. గతేడాది వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 8 లక్షల 93 వేల 223 వర్క్ ఆర్డర్ మంజూరు చేశారు. పని నిర్ధారించి తొమ్మిది లక్షల 90 వేలకు ప్రాజెక్టు అమౌంట్‌గా పేర్కొంటూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఖాన్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్‌కు 2024 ఆగస్టు 26 తేదీన టెండర్ ను ఖరారు చేసి అప్పగించారు. అధికారులు సదరు కాంట్రాక్టర్ స్థానికంగా ఎటువంటి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేయకుండానే ఏకంగా మెజర్మెంట్ రికార్డు (ఎంబీ) బుక్ లో పనులు పూర్తి చేసినట్లు పేర్కొంటూ పది లక్షల రూపాయల బిల్లులు చూపించారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నకిలీ బిల్లులు సృష్టించి అవినీతి, అక్రమాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేయకుండానే బిల్లును పొందిన కాంట్రాక్టర్ నుంచి ప్రభుత్వ సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకోవాలని, అతడిని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని కమిషనర్‌ను కోరారు.సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్ లో అధికారులు సీసీ రోడ్డు వేసినట్లుగా చెబుతున్న ప్రాంతానికి సంబంధించిన ఫొటోలు, వీడియో, సీసీ ఫుటేజీ, రికార్డులను కమిషనర్‌కు అందజేశారు.



సింగరేణి వాంబే క్వార్టర్స్‌లో అధికారులు సీసీ రోడ్డు వేసినట్లుగా చెబుతున్న ప్రదేశం

## ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

వనస్థలిపురం, మే 23 : ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానం 20వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. 20 ఏళ్లుగా దేవస్థాన అభివృద్ధికి పనిచేస్తున్న కమిటీని అభినందించారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, చంపాపేట్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మాలే రామ్‌రెడ్డి, కాటం క్రాంతి గౌడ్, చిట్టిప్రోలు రవికుమార్ పాల్గొన్నారు.

# పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తం

## పత్తాలేని ప్రత్యేకాధికారులు

- రోడ్ల మీదే పారుతున్న డ్రైనేజీ
- వీధి దీపాలు వెలగక అంధకారంలో గ్రామాలు
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- మామూళ్ల మత్తులో అధికారులు



లేమూర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ

కందుకూరు, మే 23 : గ్రామ పంచాయతీ పాలన పడకేసింది. మండలపరిధిలో లేమూర్ గ్రామంతో పాటు 35 గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ క్షీణించింది. వీధి దీపాలు నెలల తరబడి వెలగడం లేదు. గ్రామాల్లో రాత్రి అయ్యిందంటే చాలు అంధకారం అలుముకుంటుంది. ప్రత్యేక అధికారి జాడ లేకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీకి వస్తున్నారా అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్నుల మీద పెట్టిన శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో పెట్టడం లేదని విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకుండా జీ ప్లస్ వన్ ఇండ్లు నిర్మించుకోవలసి ఉన్నప్పటికీ ఎక్కడ చూసిన నాలుగు, ఐదు, అంతస్తులు కనిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో పడి నిర్మాణాలను చేపడుతున్న చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పట్టించుకోకపోవడంతో నిర్వీర్యంగా తయారయ్యాయి. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చి సమస్యలపై కార్యదర్శులతో చర్చించాల్సిన ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగా పంచాయతీలకు వచ్చి వెళుతున్నారు. ఇదే అదనుగా చూసుకొని పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీ పాలన గాడి తప్పిందని ప్రజలు విమర్శిస్తున్నారు. సర్పంచులు ఎంపీటీసీలు ఉంటే ఇలా ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.



వీధిదీపాలు వెలుగక అంధకారంలో ఉన్న లేమూరు

### పాలన గాడి తప్పింది



గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుంది .వీధి దీపాలు అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యమైంది. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. సమస్యలను పరిష్కరించడం లేదు. పాలన గాడిద తప్పింది.

–బ్రాహ్మణపల్లి జ్యోతి, మాజీ సర్పంచ్

### నిధులు లేవు..



గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. సమస్యలు ఉన్న మాట వాస్తవం. పంచాయతీల్లో నిధుల సమస్య ఉంది. 35 గ్రామ పంచాయతీల్లో సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ తరచుగా నేను గ్రామ పంచాయతీల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నా. ప్రజలు నేరుగా సమస్యలు నాకు వివరించాలి.

–బానోతు సరిత,ఎంపీడీవో

## అంగన్‌వాడీ కేంద్రంలో సంసిద్ధత మేళా

మైలార్‌దేవ్‌పల్లి, మే 23: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యా ఆరంభంలో నైపుణ్యాలు, అనుకూల వాతావరణం కల్పించడం వంటి కార్యక్రమాలు కీలకమని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాలు చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడం వల్ల భవిష్యత్తులో వారు నైపుణ్యం గల విద్యార్థులుగా ఎదగగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సూపర్‌వైజర్ పద్మజ, అశోక్, సునీల్, ప్రవీణ్, సన్నీ, కార్తీక్, లక్ష్మి, మాధవి, రత్న, గౌరీ, ప్రేమదేవి, ఆశా వర్కర్లు మంగ, మణెమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన

మైలార్‌దేవ్‌పల్లి, మే 23: వేధపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించి శుక్రవారంతో ముగిశాయి. ఉదయం మండప పూజలు, హోమాలు, అగస్యసంగర్తనాసం రత్న న్యాసం, భోజన్యాసం, ధాతున్యాసం, ఉదయం 7.36 నిమిషాలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ట, ఉదయం 9 గంటలకు కల్యాణ్యాసం, నేత్రమేళనం, 10 గంటలకు బలిప్రధానం, ధేను దర్శనం జయ్యాదిహోమం, పూర్ణాహుతి, 11 గంటలకు కుంభాభిషేకం, బ్రహ్మణ ఆశీర్వచనం, హారతి, మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం, మహాఅన్నతర్పణం, 12 గంటలకు మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భోనాలను మహిళలు తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ వాయిద్యాలు, యువతీయువకుల కేరింత మధ్య భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



దెబ్బడగూడలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శ్రావణి జంగారెడ్డి, సరిత

కందుకూరు,మే 23 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దెబ్బడ గూడ మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి జంగారెడ్డి సూచించారు. ఎంపీడీవో బానోతు సరిత తో కలిసి శుక్రవారం గ్రామం లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పత్రాలను లబ్ధి దారులకు అందజేసిన అనంతరం భూమి పూజ ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పీఏసీఎస్ డైరెక్టర్ తీగల జగదీశ్వర్ రెడ్డి ,సామ వెంకట్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నీలం వెంకటేశ్, మల్లేపల్లి ప్రభాకర్ ,దేరంగుల వసంత ,గాదె యాదగిరి ,మాజీ కోఆప్షన్ మెంబర్ సులేమాన్, జంగయ్య, జగన్ రెడ్డి, బొడ్డు బాల్ రెడ్డి ,ఎండీ వహీద్ పాల్గొన్నారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..**

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మార్కెట్ చైర్మన్ కృష్ణ నాయక్, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి గ్రంథాలయ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తెలిపారు. కొత్తగూడ గ్రామంలో 34 మందికి ఇందిరమ్మ మంజూరు కావడంతో 22 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. నాయకులు బొక్క భూపాల్ రెడ్డి , గ్రామ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్ గౌడ్, మమ్మద్ ఖదీర్, హనుమంత రెడ్డి, కుమ్మరి కృష్ణ ,దేవేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,దామోదర్ రెడ్డి ,లక్ష్మీపతి గౌడ్, లక్ష్మణ చారి ,పిట్టల యాదయ్య ,మల్లేశ్, జ్యోతి ,ఇంద్రమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సేవల నంబర్లలో మార్పులు

ఆర్కే పురం, మే 23 . సరూర్‌నగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు విభాగాలకు చెందిన అధికారులు, అత్యవసర సేవలకు సంబంధించిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నెంబర్లలో మార్పులు జరిగినట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ ఎండీ ఫర్హాత్ అలీ తెలిపారు. విద్యుత్ సంబంధిత సేవల కోసం ఇకపై ప్రజలు ఈ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. సెక్షన్ సరూర్‌నగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ 8712472349 అసిస్టెంట్ ఇంజనీర్ 8712472337.కొత్తపేట8712472350,8712472338. ఆర్కే పురం 8712472351,8712472339. ఎల్బీ నగర్ 8712472352,8712472341గ్రీనీల్స్ 7013174759, 8712472342, బండ్లగూడ 8712472358, 8712472359, హయత్ నగర్ 8712472353, 8712472343, ఆటోనగర్ 8712472355, 8712472340, శాంతినగర్ 8712472354, 8712472362. పెద్ద అంబర్‌పేట్ 8712472360,8712472344.